21న సీల్‌వెల్ సినీ సుస్వరాలు

గన్‌ఫౌండ్రీ: శృతిలయ ఫౌండేషన్, సీల్‌వెల్ కార్పొరేషన్‌ల సంయుక్తాధ్వర్యంలో ఈ నెల 21న రవీంద్రభారతిలో జై హింద్ ఇండియన్ ఆర్మీ పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శృతిలయ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా, సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండ్వారు సుబ్బారావుతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పహల్గాం బాధితులకు నివాళులర్పించడం, గాయనీ గాయకులచే దేశభక్తి గీతాలాపన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

సన్మానం



ఎస్సై ప్రసాద్‌ను సన్మానిస్తున్న ఇన్‌స్పెక్టర్ బాలస్వామి

గౌలిపురా: భవానీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ప్రసాద్‌ను ఎస్‌బీకి బదిలీ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో భవానీనగర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఎస్సై ప్రసాద్‌ను ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ ఇ.నర్సింహా నాయక్, ఎస్సైలు దామోదర్, నరేందర్ రెడ్డి ఆయన ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

రోడ్డుపైనే వ్యాపారాలు

గోల్కొండ: గుడిమల్కాపూర్ లక్ష్మీనగర్ చౌరస్తా అక్రమ పార్కింగ్‌లు, వ్యాపారాలకు నిలయంగా మారింది. రేతిబౌలి నుంచి శంషాబాద్ వెళ్లే పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే పక్కనే ఉన్న ఈ చెరువు రోడ్డుకు అన్ని వైపులా తోపుడు బండ్లు, కూరగాయల వ్యాపారులు ఆక్రమించుకున్నారు. దీంతో ఈ చౌరస్తా అత్యంత రద్దీగా మారింది. మరోవైపు చౌరస్తాను ఆనుకొని ఉన్న ఓ ఇరానీ హోటల్ ముందు ద్విచక్రవాహనాలు అక్రమంగా పార్కు చేసి ఉంటున్నాయి. ఈ చౌరస్తా వైపు ట్రాఫిక్ పోలీసులు కన్నెత్తి కూడా చూడరని స్థానికులు అంటున్నారు. రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారి ఆటలకు చెక్ పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఉస్మానియా ఆసుపత్రిలో నొప్పి నివారణ కేంద్రం



నొప్పి నివారణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎంఈ నరేందర్ కుమార్ తదితరులు

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో మొట్టమొదటిసారిగా నొప్పి నివారణ కేంద్రాన్ని ప్రారంభించారు. సామాన్య ప్రజలకు ఉచితంగా పెయిన్ మేనేజ్‌మెంట్ సేవలు అందిస్తామని, దీర్ఘకాలిక, సంక్లిష్ట నొప్పులతో బాధపడుతున్న, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందలేని రోగులకు ఇది గొప్ప ఉపశమనం కలిగిస్తుందని రాష్ట్ర హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేందర్‌కుమార్ అన్నారు. ఈ కేంద్రాన్ని విదేశాలలో నివసిస్తున్న భారతీయ వైద్యుల సహకారంతో ఏర్పాటు చేశామన్నారు. ఉస్మానియా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్, ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారామ్, అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ అభిమన్యు సింగ్ సహకారంతో ఈ ప్రాజెక్ట్ విజయవంతమైందని తెలిపారు.

నెహ్రూ జూపార్క్ అడ్వైజరీ కమిటీ సమావేశం



చార్మినార్: నెహ్రూ జూపార్కులో శనివారం ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఎలుసింగ్ మేరు అధ్యక్షతన 3వ జూ అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. జూ ఆధునీకరణ, సాకర్యాలకు సంబంధించి పరిశోధన, సంరక్షణ పెంపకంతో పాటు వన్యప్రాణుల అవగాహన, జంతు సంక్షేమం, విద్య దృష్టితో వివరణ, పర్యావరణ విద్యా కేంద్రం, జీవవైవిధ్యాన్ని మెరుగుపరచడం, ఉద్యోగుల శిక్షణలు, సోషల్ మీడియా ఉనికిని మెరుగుపరచడం, మీర్ ఆలం ట్యాంక్‌కు సంబంధించిన నీటి కాలుష్యం, పశుగ్రాసం ప్రాంత అభివృద్ధి, ప్రకృతి దృశ్య మెరుగుదలలు, సేకరణకు కొత్త జంతువులను జోడించడం, సహకార పరిశోధన మొదలైన అంశాలపై కమిటీ సభ్యుల నుంచి సలహాలు తీసుకోవడం సమావేశం ఎజెండా. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని జూ పార్కుల డైరెక్టర్ డాక్టర్ సునీల్ ఎస్. హిరేమత్, రెండవ సలహా కమిటీ సమావేశంలో చర్చించిన ఎజెండా అంశాలను ఈ ఎజెండా అంశాలపై తీసుకున్న నిర్ణయాలను సిఫార్సును ప్రస్తావించారు.

ట్రాఫికర్

- కార్వాన్ నియోజకవర్గంలో తప్పని ట్రాఫిక్ తిప్పలు
- వాహనదారులకు షార్ట్ కట్‌లతోనే సమస్య
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



గోల్కొండ బంజారా దర్వాజా వద్ద ముందుకు కదలని వాహనాలు

గోల్కొండ: మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్, పాత ముంబాయి జాతీయ రహదారి, నానల్‌నగర్, టోలిచౌకీ రేతిబౌలి కూడలి, నానల్‌నగర్ చౌరస్తా, మెహిదీపట్నం పాత మెరాజ్ హోటల్ లాంటి కూడళ్లల్లో తదితర ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. చిన్న కూడళ్ల వద్ద సైతం కొంత కాలంగా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. ద్విచక్ర వాహనాదారులు, ఆటో వాలాలు ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్యను తప్పించుకునేందుకు బస్తీలు, కాలనీలలోని గల్లీల నుంచి షార్ట్ కట్ ఎంచుకుంటున్నారు. మరో వైపు టోలిచౌకీ, లక్ష్మీనగర్ చౌరస్తా, పాత ముంబాయి జాతీయ రహదారి తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనుల పేరిట భారీగా జరుగుతున్న తవ్వకాల కారణంగా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. ట్రాఫిక్ జామ్‌లు నివారించడానికి ట్రాఫిక్ పోలీసులు చేపడుతున్న ప్రయోగాలు వికటిస్తున్నాయి. కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు ప్రైవేటు ఉద్యోగులు ట్రాఫిక్ జామ్‌లలో చిక్కుకొని టైమ్‌కు చేరుకోలేకపోతున్నారు.

పైపులైన్ పనుల కారణంగా..

టోలిచౌకీ–టూంబ్స్ రోడ్డులో ఏడాది కాలంగా భారీ పైపులైన్ పనులు జరుగుతున్నాయి. దీనికి గాను రోడ్డును తవ్వేస్తున్నారు. పైపులు వేసిన కూడా గుంతలను పూడ్చడం లేదు. ఈ రోడ్డుపై ఏడాది కాలంగా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. ఇదిలా ఉండగా టోలిచౌకీ నుంచి గోల్కొండ మోతీదర్వాజా వరకు గల కిలో మీటర్ దూరానికి అరగంట పడుతుంది. అక్బర్‌పురా, ఎండి లైన్స్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో నత్తనడకన జరుగుతున్న పైపులైన్ పనుల కారణంగా రోడ్లపై భారీ గుంతలు ఉన్నాయి.

షార్ట్ కట్‌యే అసలు సమస్య...

వాహనాదారులు ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్‌ను తప్పించుకునేందుకు షార్ట్ కట్‌ను ఎంచుకుంటున్నారు. జూబ్లీహిల్స్, గచ్చిబౌలి తదితర ప్రాంతాల వారు లంగర్‌హౌస్‌కు వెళ్లాలంటే టోలిచౌకీ మీదుగా నానల్‌నగర్ గుండా వెళ్లాలి. ట్రాఫిక్ జామ్ నుంచి తప్పించుకునేందుకు టోలిచౌకీ అక్బర్‌పురా, ఎండిలైన్స్ గుండా ఫ్లోర్ మిల్ నుంచి లంగర్‌హౌస్ వెళ్తుంటారు. అసలే ఇరుకుగా ఉండే ఈ రోడ్లపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. ఇదిలా ఉండగా గుడిమల్కాపూర్, కార్వాన్ నుంచి వచ్చే వారు లక్ష్మీనగర్ మీదుగా గోల్కొండ, లంగర్‌హౌస్ రావడానికి కూడా షార్ట్ కట్‌లను ఎంచుకుంటున్నారు. ఈ కారణంగా చిన్న చిన్న చౌరస్తాలు సైతం ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలుగా మారుతున్నాయి.

ట్రాఫిక్ నియంత్రణకు పక్కా చర్యలు తీసుకోవాలి..

మెహిదీపట్నం నుంచి నానల్‌నగర్ చౌరాస్త వరకు ట్రాఫిక్‌ను తగ్గించడానికి ట్రాఫిక్ పోలీసులు రోడ్డు డివైడర్‌కు ఓవైపు రోప్‌లు బిగించి వాహనాలను అనుమతిస్తున్నారు. దీంతో కూడళ్ల వద్ద వరకు ఎలా వెళ్లాలో, యూటర్న్ ఎప్పుడు తీసుకోవాలో తెలియక వాహనాదారులు అయోమయానికి గురవుతున్నారు. ప్రస్తుతం గోల్కొండ, బంజారి దర్వాజా, ఫతేదర్వాజా, రేతిబౌలి చౌరస్తా, నానల్‌నగర్ హస్తం చౌరస్తాలు ట్రాఫిక్ జామ్‌లకు కేరాఫ్ అడ్రస్‌లుగా మారాయి. ఆసిఫ్‌నగర్, టోలిచౌకీ ట్రాఫిక్ పోలీసులు సమన్వాయంతో ట్రాఫిక్ నియంత్రణకు పక్కా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సకాలంలో ఆఫీసులకు చేరుకోలేకపోతున్నాం



ట్రాఫిక్ జామ్‌లను దృష్టిలో పెట్టుకొని కనీసం గంటన్నర ముందు ఇంటి నుంచి ఆఫీసుకు బయలు దేరుతున్నాం. అయినా వారానికి కనీసం మూడు రోజులు ట్రాఫిక్ జామ్‌ల కారణంగా ఆఫీసులకు సకాలంలో చేరుకోలేకపోతున్నాం. కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిబ్బంది కానరావడం లేదు. పెరుగుతున్న వాహనాలకు అనుగుణంగా పోలీసులు ట్రాఫిక్ జామ్‌లను నియంత్రించేందుకు పక్కా చర్యలు తీసుకోవాలి.

– మిర్జా ఎక్బాల్ అహ్మద్, సమతాకాలనీ

అక్రమ పార్కింగ్‌లను నిరోధించాలి



ట్రాఫిక్ జామ్‌లు కావడానికి రోడ్లపై అక్రమ పార్కింగ్‌లు ప్రధాన కారణం. షేక్‌పేట్ పాస్‌పోర్టు సేవా కేంద్రం, టోలిచౌకీ చౌరస్తా, తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్‌లతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు వివిధ రకాల చాలన్‌లు వేస్తూ ద్విచక్ర వాహనదారులను పరేషాన్ చేస్తున్నారే తప్ప ట్రాఫిక్ జామ్‌ల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదు. చౌరస్తాల వద్ద, రోడ్ల పక్కన వెలిసిన అక్రమ డబ్బాలు, అక్రమ పార్కింగ్‌లను నివారించాలి.

– సత్యనారాయణ, షేక్‌పేట్

బీఆర్ఎస్ హయాంలోనే మైనార్టీల సంక్షేమం



సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడుతున్న మహ్మద్ సలావుద్దీన్ లోది

చార్మినార్: బీఆర్ఎస్ హయాంలోనే మైనార్టీల సంక్షేమం జరిగిందని ఆ పార్టీ చార్మినార్ శాసనసభ నియోజకవర్గం ఇన్‌చార్జి మహమ్మద్ సలావుద్దీన్ లోది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కూడా ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే తమ అసోసియేషన్ తరపున పూర్తిగా మద్దతు తెలిపి మాతో ముందుకు నడిస్తే రాబోయే రోజుల్లో ముస్లింల సంక్షేమానికి మరింత దోహదం చేసిన వారవుతారన్నారు. జూన్ 12న గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో సమావేశం నిర్వహించి తగిన నిర్ణయాలు తీసుకోనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మీర్ అజ్మత్ అలీ, ఉపాధ్యక్షుడు అబ్దుల్ ఫయాం, ప్రతినిధులు ఇస్మాయిల్ అలీ ఖాన్, డాక్టర్ కుద్దూస్, డాక్టర్ మాజీద్ బేదార్, రిటైర్డ్ ప్రొఫెసర్ ఆమీర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

అబిడ్స్: ఇందిరా ప్రియదర్శిని మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 19న ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రముఖర్జీ తెలిపారు. జెన్ పాక్ట్, అపోలో, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఇతర కంపెనీల కోసం ఎంపిక జరుగుతోందన్నారు. ఈ జాబ్ మేళాలో అన్ని కళాశాలలకు చెందిన డిగ్రీ పూర్తి చేసిన, చివరి సంవత్సరం విద్యార్థులు బయోడేటా, సర్టిఫికెట్లతో పాల్గొనవచ్చని ఫౌండేషన్ హెచ్ఆర్ మేనేజర్ రవికాంత్ తెలియజేశారు.

ఘనంగా తిరంగా ర్యాలీ



ఎగ్జిబిషన్ మైదానంలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఉపాధ్యక్షుడు నీరంజన్, కార్యదర్శి సురేందర్‌రెడ్డి

అబిడ్స్: ఎగ్జిబిషన్ గ్రౌండ్ నుంచి తిరంగ ర్యాలీ నిర్వహించారు. ఎగ్జిబిషన్ సొసైటీ, ఎగ్జిబిషన్ ఎకనామిక్ కమిటీ, ఎగ్జిబిషన్ ఓజీఏలు ఈ ర్యాలీని చేపట్టారు. ఎగ్జిషన్ నుంచి ట్యాంక్ బండ్ వరకు భారత సైనికులకు మద్దతుగా ఈ ర్యాలీని చేపట్టారు. పాకిస్తాన్‌కు హెచ్చరికలు చేస్తూ ఈ ర్యాలీని కొనసాగించారు. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షులు కె.నీరంజన్, కార్యదర్శి బి.సురేందర్‌రెడ్డి, సభ్యులు బి.వెంకటేశ్వర్‌రావు, మురళీమోహన్, ప్రొఫెసర్ మహ్మద్ మసూద్ అహ్మద్, శంకర్‌లాల్ బల్‌దేవా పాల్గొన్నారు.

బజరంగ్ సేన ఆధ్వర్యంలో..

పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని రూపుమాపేందుకు భారత్ సైనికులు చేసిన కృషి అమోఘమని బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఆర్.లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. శనివారం బషీర్‌బాగ్ నుంచి ట్యాంక్‌బండ్ వరకు భారత త్రివిధ దళాలకు మద్దతుగా బజరంగ్ సేన ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన చేశారు. లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ..50 ఏళ్ల తర్వాత పాకిస్తాన్‌కు ప్రధాని మోదీ ప్రభుత్వం తగిన గుణపాఠం చెప్పిందన్నారు. ప్రతి భారతీయుడు భారత సైనికులకు మద్దతుగా ఉండి పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పేవిధంగా కృషి చేయాలన్నారు.

గుడిమల్కాపూర్ నుంచి..

గోల్కొండ: బీజేపీ అధిష్టానం పిలుపు మేరకు శనివారం మాసాబ్‌ట్యాంక్ వద్ద జరగనున్న తిరంగా యాత్రకు గుడిమల్కాపూర్ నుంచి బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భారత్‌ను తక్కువ అంచనా వేసి పాకిస్తాన్ భారీ మూల్యం చెల్లించుకుందన్నారు. అలాగే టోలిచౌకీ, నానల్‌నగర్ డివిజన్‌ల నుంచి సైతం తిరంగా యాత్రకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. బీజేపీ టోలిచౌకీ డివిజన్ అధ్యక్షుడు బి.శ్రీకాంత్ ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు.



బషీర్‌బాగ్ నుంచి తరలివెళ్తున్న ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు, మనోజ్ మొగల్ గిద్ది తదితరులు



గుడిమల్కాపూర్ నుంచి బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్ తదితరులు

‘పెంచిన మెట్రో చార్జీలను విరమించుకోవాలి’

గౌలిపురా: మెట్రో రైలు చార్జీలను పెంచడంతో పేద, మధ్య తరగతి ప్రయాణికులకు భారమని..పెంచిన చార్జీలను పునరాలోచన చేసి విరమించుకోవాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యుడు గడ్డమీది చంద్ర మోహన్ గౌడ్ డిమాండ్ చేశారు. ఎన్నికల్లో నేరవేర్చని..సాధ్యం కానీ పనికి మాలిన హామీలను ఇచ్చి అవి అమలు చేయడానికి ఏదో ఒక రూపంలో ధరలను పెంచి పేద, మధ్య తరగతి ప్రజల మీద భారం మోపడం శోచనీయమని విమర్శించారు. ఈ పెంపుదలతో సామాన్య ప్రజానీకంపై తీవ్ర భారం పడుతుందని..పెంచిన మెట్రో రైలు చార్జీలను తగ్గించి యధావిధిగా ఉన్న చార్జీల ప్రకారమే నడపాలని కోరారు.

సత్కారం



శ్రీనివాస రంగనాథచార్యులను సత్కరిస్తున్న శ్రీ రంగనాథ సేవా సమితి సభ్యులు చంద్రకాంత్

జియాగూడ: తెలంగాణ రాష్ట్ర స్థాయిలో జియాగూడ రంగనాథ ప్రధాన అర్చకుడు శ్రీనివాస రంగనాథ చార్యులు ఇటీవల రెండవ దామోదర బట్టా చార్యులుగా బిరుదు పొందడం అభినందనీయమని శ్రీ రంగనాథ సేవా సమితి ప్రతినిధులు గూడుమని చంద్రకాంత్ అన్నారు. శనివారం జియాగూడ రంగనాథ స్వామి ఆలయంలో ఫౌండర్ ట్రస్టీ ఎస్.టి.చారి, ప్రతినిధులు శేషాచారిల సమక్షంలో సన్మానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దామోదర బట్టాచార్యులుగా బిరుదు పొందిన తాను శ్రీనివాస రంగనాథ బట్టాచార్యులుగా నామంతోనే కొనసాగుతానని స్పష్టం చేశారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

నాంపల్లి: రైలు కింద పడి గుర్తుతెలియని యువకుడి ఆత్మహత్య చేసుకున్న ఘటన నాంపల్లి జనరల్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని చందానగర్–లింగంపల్లి రైల్వే స్టేషన్ల మధ్యలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... సుమారు 35 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని యువకుడు రైలు పట్టాల మీద పడుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి ఒంటిపై నీలి రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించినట్లు పోలీసులు తెలిపారు. అతడి జేబులో గచ్చిబౌలి నుంచి లింగంపల్లికి ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన టికెట్ ఉన్నట్లు తెలిపారు. అలాగే చేతులపై ఓమ్, మామ్ అనే పచ్చబొట్లు ఉన్నట్లు వివరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తుర్కియే వస్తువులను బహిష్కరించాలి



ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

సుల్తాన్‌బజార్: తుర్కియే వస్తువులను, తుర్కియే టూరిజాన్ని బహిష్కరించాలని కోరుతూ శనివారం బీజేపీ కార్యాలయం వద్ద జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా తుర్కియే అధ్యక్షుడి చిత్రపటాన్ని దహనం చేశారు. అనంతరం రాకేష్ జైస్వాల్ మాట్లాడుతూ.. భారతదేశానికి వ్యతిరేకంగా ఉన్న తుర్కియే వస్తువులను, తుర్కియే టూరిజాన్ని భారతీయులు బహిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. భారతదేశానికి వ్యతిరేకంగా ఉన్న దేశాలకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. తుర్కియే వస్తువులను బహిష్కరించే ఉద్యమం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్ యాదవ్, మయూర్, అనిల్ యాదవ్, ఆనంద్, రాజ్‌కుమార్, ప్రవీణ్, జనార్దన్, సందీప్, రవి, అనిల్ యాదవ్ పాల్గొన్నారు.

ఆషూర్‌ఖానాల వద్ద సమస్యల పరిష్కారానికి చర్యలు



ఆషూర్‌ఖానాలను సందర్శించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

యాకుత్‌పురా: మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీగా రెండవ సారి ఎన్నికైన మీర్జా రియాజుల్ హసన్ అఫాందీ ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ శనివారం స్థానిక కార్పొరేటర్లతో కలిసి ఆషూర్‌ఖానాలను సందర్శించారు. యాకుత్‌పురా, రెయిన్ బజార్, మౌలాక చీల్లా, బడాబజార్, షౌకాత్ జంగ్ దేవిడి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రానున్న మొహర్రం సంతాప దినాలను పురస్కరించు కొన్ని ఆషూర్‌ఖానాల వద్ద నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆషూర్‌ఖాలో మజ్లిస్, మాతం నిర్వహించేందుకు వచ్చే వారికి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లను చేయాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో రెయిన్‌బజార్, డబీర్‌పురా కార్పొరేటర్లు మహ్మద్ వసీవుద్దీన్, అలందర్ వాలా జహి, మజ్లిస్ పార్టీ ఏరియా కమిటీ అధ్యక్షులు, జీహెచ్ఎంసీ, జలమండలి విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా వైద్య సేవలు



ఆసుపత్రి సూపరిండెంటెండ్‌తో కాంగ్రెస్ నాయకులు

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రి కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా వైద్య సేవలు అందిస్తుందని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం సీనియర్ కాంగ్రెస్ నాయకులు పరమానందం ఆధ్వర్యంలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌ను కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ..ఆసుపత్రికి వచ్చే పేషంట్ల సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు. రోజుకు 800–1000 ఔట్ పేషంట్లు వస్తున్నారని పేర్కొన్నారు. అదే విధంగా ఇన్ పేషంట్ల వార్డులు వంద శాతం ఆక్యూపెన్సీతో ఉంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ రాకేష్ కుమార్, డాక్టర్ పవన్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు ఆబేద్, ఇలియాస్ ఆలీ తదితరులున్నారు.

రాజీ మార్గంలోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న న్యాయమూర్తి పంచాక్షరి

సుల్తాన్‌బజార్: రాజీ మార్గం, రాజమార్గంలో కోర్టులకు వెళ్లకుండా అనేక సమస్యలు పరిష్కారం అవుతాయని సీనియర్ సెషన్ జిల్లా న్యాయమూర్తి పంచాక్షరి అన్నారు. తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మీడియేషన్, క్షత్రీయ రాజ్‌పుత్ సభ మీడియేషన్ సెంటర్‌ను శనివారం కుబ్దిగూడలో జడ్జి పంచాక్షరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇలాంటి మీడియేషన్ సెంటర్ల ద్వారా రాజీ మార్గం ద్వారా అనేక సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. కోర్టులకు వెళ్లకుండానే, పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కకుండానే ఇరు పక్షాలను పిలిపించి రాజీ చేయడమే లక్ష్యంగా ఈ మీడియేషన్ సెంటర్లు పనిచేస్తాయన్నారు. మొదటి సెంటర్‌ను సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలో ఏర్పాటు చేశామని తెలిపారు. అదేవిధంగా ఇటీవల 150 మంది వలంటీర్లకు శిక్షణ ఇచ్చామని గుర్తుచేశారు. 2023లో వచ్చిన మీడియేషన్ చట్టాన్ని మరింత బలోపేతం చేసేలా న్యాయ సేవాధికార సంస్థ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పద్మిని సింగ్, అజిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గుడిమల్కాపూర్ అల్లూరి సీతారామరాజు నగర్‌కు చెందిన పలువురు శనివారం ఆయనను మెరాజ్ కాలనీలోని కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా గతేడాది ఎమ్మెల్యే నిధులతో తమ ప్రాంతంలో అభివృద్ధి పనులు చేసినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..అల్లూరి సీతారామరాజునగర్‌లో తాను త్వరలోనే పర్యటిస్తానన్నారు. ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. నిరుపేదలు, దళితులు ఎక్కువగా ఉండే అల్లూరి సీతారామరాజునగర్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతానన్నారు.

పర్యాటక ప్రాంతాలు కిటకిట



గోల్కొండ: పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు కావడంతో పర్యాటక ప్రాంతాలు రద్దీగా మారాయి. సెవన్ టూంబ్స్‌లోని కుతుబ్‌షాహీ రాజుల సమాధుల ప్రాంగణం, గోల్కొండ కోట, తారామతి బారదారి తదితర ప్రాంతాలు ప్రతినిత్యం వేలాది మంది పర్యాటకులతో కళకళలాడుతున్నాయి. సుందరీకరణ పూర్తి చేసుకున్న కుతుబ్‌షాహీ రాజుల సమాధులు పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మరోవైపు దక్షిణ భారతదేశంలోనే అత్యంత ప్రతిష్టమైన కోటగా పేరొందిన గోల్కొండ కోటకు వేలాది మంది పర్యాటకులు తరలివస్తున్నారు. భారీ సంఖ్యలో వచ్చే పర్యాటకులతో గోల్కొండ కోట ఎదురుగా ఉన్న ఇరానీ హోటల్స్, రెస్టారెంట్లు కిటకిటలాడుతున్నాయి.

పాత కక్షలతోనే అయాన్ ఖురేషీ హత్య

నలుగురి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు

నాంపల్లి: రెడ్‌హిల్స్‌లోని ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి ఎదుట జరిగిన హత్య కేసును నాంపల్లి శాంతిభద్రతల పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. పాత బస్తీ హఫీజ్ బాబా నగర్‌కు చెందిన 21 ఏళ్ల అయాన్ ఖురేషీని మే 15న ప్రత్యర్థులు పాత కక్షల కారణంగా అత్యంత కిరాతకంగా కత్తులతో నరికి చంపిన విషయం తెలిసిందే. అయాన్ ఖురేషీని చంపిన నలుగురు నిందితులను శనివారం అరెస్టు చేశారు. హత్యకు పాల్పడిన వారిలో సయ్యద్ మహమూద్ ఖాద్రి అలియాస్ ఉస్మాన్ ఖాద్రీ అలియాస్ ముజఫర్, మహ్మద్ అస్లాం, ఎండీ సిద్దిఖ్ అహ్మద్, సయ్యద్ మాజిద్ ఖాద్రి అలియాస్ మతీన్‌లు ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు నలుగురిని ఒక పక్కా సమాచారంతో పట్టుకున్నారు. మధ్య మండలం డీసీపీ శిల్పవల్లి ఆదేశాలతో సైఫాబాద్ ఏసీపీ ఆర్.సంజయ్‌కుమార్ నాంపల్లి ఇన్‌స్పెక్టర్ కె.నారాయణరెడ్డితో కలిసి హత్య కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అయాన్ ఖురేషీ సోదరి నిందితుల్లో ఒకరి తమ్ముడిని 2016లో వివాహం చేసుకుంది. అయితే కుటుంబ కలహాల కారణంగా ఖురేషీ, అతడి కుటుంబ సభ్యులు 2020లో ఒక హత్య కేసులో ఇరుక్కున్నారు. అప్పటి నుండి నిందితులు పగ పెంచుకున్నారు. అదును కోసం వేచి చూసి..మే 15న నాంపల్లిలోని జువైనల్ కోర్టులో విచారణకు హాజరైన అయాన్ ఖురేషీని హత్య చేసేందుకు నిందితులు కుట్ర పన్నారు. ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి ఎదుట క్రికెట్ బ్యాట్, కత్తులతో దాడి చేసి ప్రాణాలు తీశారు. ఈ కేసుకు సంబంధించి రెండు కత్తులు, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక యాక్టివా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ ఆర్.సంజయ్ కుమార్ వివరించారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.